క్లుప్తంగా

విద్యాసంస్థల బంద్ విజయవంతం

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన పాఠశాలలు, కళాశాలల బంద్ విజయవంతమైంది. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను ఏఐఎస్ఫ్ నాయకుల ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పస్తం పృథ్వీ, చింత జగదీష్ మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌళిక సౌకర్యాలను కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల గడువు పెంపు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దేవుళ్లపల్లి శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మిగిలి ఉన్న కొన్ని సీట్లు భర్తీ చేసేందుకు అడ్మిషన్ల గడువు పెంచడం జరిగిందన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా అడ్మిషన్లు పొందాలన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరం



దేవరుప్పుల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ హయాంలో ఉచిత కరెంట్‌తో వ్యవసాయ విప్లవం వర్ధిల్లుతున్న తరుణంలో తానా సభల్లో మూడుగంటల కరెంట్ చాలన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని బీఆర్ఎస్ మండల నాయకుడు పల్లా సుందరామిరెడ్డి విమర్శించారు. బుధవారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ముసుగులో చంద్రబాబు సిద్ధాంతాలను అములు చేసేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంపర్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో రాజకీయ ఉనికికోసం పాటుపడుతున్న కాంగ్రెస్‌కు రేవంత్‌రెడ్డి తోడై ఆ పార్టీ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని చెప్పక తప్పదన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

లింగాలఘణపురం: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా బుధవారం మండలంలోని నెల్లుట్లలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఐక్య సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు వజ్రయ్య, శ్రీనివాసు, శ్రీహరి, మండల కమిటీ బాధ్యులు గణేష్, శ్రీనివాసాచారి, కిష్టయ్య, ప్రవీణ్, జ్యోతి, ఇంద్రసేనారెడ్డి, భవానిపాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి గొల్లపల్లి సమీర పలు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిందని ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ సర్వేజనా ఫౌండేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో విద్యాలయమే దేవాలయం అనే అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో సమీరా ప్రథమ బహుమతిని పొందినట్లు తెలిపారు. విద్యార్థికి నగదు తో పాటు మెమోంటో ఇచ్చి సత్కరించామని చెప్పారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక




పొన్నాల రవి, లొంక సురేష్

పాలకుర్తి: ఈరవెన్ను గ్రామ యూత్ కాంగ్రెస్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పొన్నాల రవి, ఉపాధ్యక్షులుగా గాదరి నర్సయ్య, గాదరి అశోక్, ప్రధాన కార్యదర్శిగా లొంక సురేష్, సహాయ కార్యదర్శిగా ఇంతల సుధాకర్, దామెర ప్రశాంత్, కోశాధికారిగా తొడ్సు మల్లేష్, కమిటీ సభ్యులుగా శిదిలం ప్రభాకర్, వల్లపు మల్లయ్య, కొడిశాల అయోధ్య, కూస అనిల్, దామెర శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



జనగామ రూరల్/ కొడకండ్ల/చిల్పూరు /జఫర్‌గఢ్/ దేవరుప్పుల/రఘునాథపల్లి/ బచ్చన్నపేట/స్టేషన్‌ఘన్‌పూర్/: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదని జీపీ కార్మికులు స్పష్టం చేశారు. ఎంపీడీఓ కార్యాలయాల వద్ద చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. జీపీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ



లింగాలఘణపురం: నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజయ్య తదితరులు



జనగామ రూరల్:దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కొడకండ్లలో.. బీఆర్ఎస్ శ్రేణులు

రఘునాథపల్లి/చిల్పూరు/లింగాలఘణపురం/ జఫర్‌గఢ్: రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం చేపట్టిన నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను జిల్లా వ్యాప్తంగా దహనం చేశారు. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తుంటే.. 3 గంటల విద్యుత్ చాలు అంటూ అమెరికాలో ఎన్ఆర్ఐల సమావేశంలో వ్యాఖ్యానించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు ద్రోహిగా నిలిచాడని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ రఘునాథపల్లి, లింగాలఘణపురం, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల్లో చేపట్టిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

జనగామ రూరల్: రైతులకు 3 గంటల ఉచిత విద్యుత్ సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని, వెంటనే రైతాంగానికి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. మండల పార్టీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ ప్రమోద్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, కొమ్మురాజు, ఇరుగు యాకన్న, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

కొడకండ్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా దేశంలో ఎక్కడా అమలు చేయని వినూత్న సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తూ రైతులకు నిరంతర 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఖ్యాతి గడించాడని, ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ అన్నారు. మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలిపి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, వీరమనేని యాకాంతరావు, సహకార సొసైటీ చైర్మన్ బొబ్బాల రంగారెడ్డి, చిట్యాల ఐలమ్మ మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు రైతులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో బుధవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి

తరిగొప్పుల: రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని వాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదేశాల మేరకు మండలకేంద్రంలో రాస్తారోకో నిర్వహించి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అధికార ప్రతినిధి చిలువేరు లింగం, సర్పంచ్ దామెర ప్రభుదాస్, అంకం రాజారాం తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పులలో..



బచ్చన్నపేటలో..



పాలకుర్తిలో..

ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



జనగామ: జిల్లా కేంద్రంలో పొన్నాల వర్గం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న నాయకులు



పాలకుర్తిలో..



రఘునాథపల్లి: కంచనపల్లిలో..

తరిగొప్పుల: వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే ప్రభుత్వానికే దక్కుతుందని పార్టీ నాయకులు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించడాన్ని నిరసిస్తూ టీపీపీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను బుధవారం మండలకేంద్రం ప్రధాన కూడలి వద్ద దహనం చేశారు. దామెర జయరాజు, ఎడెల్లి శ్రావణ్‌రెడ్డి, థామస్,దండెం ప్రకాశం, మూడిక కుమార్, చిక్కొండ పోషయ్య, మూల రాములు, పండుక కనకయ్య పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

కొడకండ్ల: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరిస్తూ రైతులను తప్పుదోవ పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు కుటిల యత్నాలు చేయడం సిగ్గు చేటని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. సోమనర్సయ్య, రవిందర్, రమేష్, భిక్షపతి, రాజు, శ్రీనివాస్, యాకేష్ ఉన్నారు.

సబ్ స్టేషన్ ఎదుట ధర్నా

బచ్చన్నపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ఎదుట పలువురు నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పాలకుర్తి: రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు దిష్టిబొమ్మలను దహనం చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మాటలను వక్రీకరించడం సరికాదని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, శ్రీనివాస్, జలగం ఉపేందర్, ఎంపీటీసీ మానస, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకిగా బీఆర్ఎస్ నాయకుల అసత్యపు ప్రచారాన్ని నిరసిస్తూ మండలంలోని కంచనపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రామ్మూర్తి, జయరాములు, లోనె రవీందర్, మనోహర్, లోనె సోమాజి, తీజు, భిక్షపతి, దశరథ, పురుషోత్తం, పృథ్వీ, యాదయ్య పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో బుధవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. చింత ఎల్లయ్య, మాజీ జెడ్పీటీసీ గుర్రం యాదగిరి, సతీష్‌రెడ్డి, ఐలపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

బచ్చన్నపేట: 18 సంవత్సరాలు నిండి వాహనాలు నడిపే యువతీ, యువకులు డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పలువురి వద్ద నుంచి డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు ఫారాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ ఎస్ఎస్‌సీ మెమో, పాన్‌కార్డు, రెండు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని, ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లను అందిస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, నాయకులు వడ్డెపల్లి మల్లారెడ్డి, నర్సింహులు, మధుప్రసాద్, గుర్రపు బాల్‌రాజు, కృష్ణంరాజు, సిద్దిరాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



రఘునాథపల్లి: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి/లింగాలఘణపురం: రైతుల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని దొడ్డుగుట్ట నాబార్డు గోదాంలకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా రూ.77 లక్షలతో మంజూరైన ప్రహరీ, సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంగారు తెలంగాణలో భాగంగా రైతును రాజును చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బాల్దె సిద్దిలింగం, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, జెడ్పీటీసీ బొల్లం అజయ్, జనగామ వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యదర్శి నాగేశ్వరశర్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, సర్పంచ్ గవ్వాని విజయ, ఎంపీటీసీ కేమిడి రమ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల సమీపంలో ఉన్న మార్కెట్ గోదాంల వద్ద రూ.69 లక్షలతో చుట్టూ ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఎంపీపీ జయశ్రీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, మార్కెట్ డైరెక్టర్లు, ఎంపీటీసీ రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, సీపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం



ఎమ్మెల్యే, సీపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దళితులు

తరిగొప్పుల: కబ్జాకు గురైన దళితుల భూమిని విడిపించి దళితులు సాగుచేసుకునేలా చేసినందుకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. మండలంలోని పోతారం రెవెన్యూ పరిధి దళితుల చెందిన సర్వే నంబర్ 47లో 7 ఎకరాల భూమిని అక్కరాజుపల్లి కి చెందిన బూస బుచ్చయ్య గత కొంత కాలంగా ఆక్రమించి సాగుచేసుకుంటున్నాడు. దీంతో సదరు దళితులు విషయాన్ని ఎమ్మెల్యే, సీపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు చొరవతీసుకొని కబ్జాకు పాల్పడిన బూస బుచ్చను భూమిని ఖాళీ చేయాల్సిందిగా, హక్కు పత్రాలు ఉన్నట్లయితే కోర్టు ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించడం జరిగిందన్నారు. పాకాల యాదగిరి, ఎండబట్ల చంద్రమౌళి, ఎండబట్ల అమరేందర్, బొమ్మెన పరుశరాములు, చింతల శారద, సొనాది లచ్చవ్వ,పాకాల బాలయ్య, సుభద్ర, సురేష్, రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



జనగామ: చెక్కు అందజేస్తున్న కిరణ్ కుమార్ గౌడ్



చిల్పూరు: నివాళులర్పిస్తున్న వాసు

జనగామ: పట్టణంలోని ధర్మకంచకు చెందిన బొట్ల యాకూబ్, ఎల్లమ్మ భార్యా భర్తలు మూడు నెలల వ్యవధిలో అనారోగ్యంతో మృతి చెందగా, అనాథగా మారిన కూతురు స్వాతికి బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అంతకుముందు స్వాతితో పాటు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. భవిష్యత్‌లో స్వాతికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీనియర్ నాయకులు కందుకూరి ప్రభాకర్, వేముల లక్ష్మణ్ గౌడ్, తిప్పరాపు ప్రసాద్, ఆకుతోట మురళీకృష్ణ, తిప్పరాపుశ్రీను, కర్రె శ్రీ ను, ఉదయ్ కుమార్, శ్రీకాంత్, పశ్చిమడ్ల సాయి, గుండె రాజు, గుండె అజ య్, బాబు పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్టకు చెందిన ఓర్సు అరుణ మంగళవారం మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు డబ్బులు లేవనే విషయాన్ని తెలుసుకున్న మండల బీజేవైఎం అధ్యక్షుడు గొల్లపల్లి వాసు కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా కృషిచేశాడు. అరుణ మృతి చెందిన విషయం తెలుసుకున్న వాసు వాట్సప్ గ్రూపు క్రియేట్ చేసి కుటుంబాన్ని ఆదుకోవాలంటూ కోరాడు. దీంతో బుధవారం మృతదేహానికి నివాళులర్పించి ఉదయం వరకు వచ్చిన రూ. 13వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబీలకు అందజేశారు. వెంటనే స్పందించిన నాయకులు రమేష్, బాల్నె శ్రీనివాస్, గుంజ రఘుపతి, గంటె ఉపేందర్, గణేష్, శ్రీను, బాల్నె రంజిత్, సురేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

ఎస్‌ఎంసీలతోనే పాఠశాలల అభివృద్ధి



విద్యార్థులతో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

రఘునాథపల్లి: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని సెంట్రల్ ఫర్ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ అండ్ స్టడీస్ సభ్యుడు నాగేశ్వర్‌రావు అన్నారు. ఆయన బుధవారం మండల పరిధి మండలగూడెం, అశ్వరావుపల్లి, కోడూర్, వెల్ది, కంచనపల్లి, భాంజీపేట ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. ఆయా స్కూళ్ల విద్యా కమిటీల నిర్వహణకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. 2021-22, 23 విద్యా సంవత్సరాల్లో ఎన్ని సమావేశాలు నిర్వహించారు.. అభివృద్ధి కమిటీలు చేసిన తీర్మానాలు ఏమిటని పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ శుభ్రతపై ఉపాధ్యాయుల చొరవ బాగుందని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సింహారావు, మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి, హెచ్ఎంలు భారతిరవీందర్, పద్మజ, కేపీఎల్ఎస్.రెడ్డి, అనితకుమారి, వెంకటేశ్వర్లు, బాల కిషన్‌రావు, వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు ఉన్నారు.

తాపీ మేస్త్రీ కుటుంబానికి సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సోమసుందర్

దేవరుప్పుల: మండలకేంద్రానికి చెందిన తాపీమేస్త్రీ గట్టగల్ల రాజు ఇటీవల మృతిచెందగా ప్రముఖ రియల్‌ఎస్టేట్ వ్యాపారవేత్త, బీఆర్ఎస్ మండల నాయకుడు ఏల సోమసుందర్ ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్‌గౌడ్, వైద్యాధికారి ఏల అనిల్‌కుమార్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కారుపోతుల భిక్షపతి, జోగు సోమనర్సయ్య, లొడంగి వెంకటేశ్వర్లు, చింత యాదగిరి, బాషిపాక అబ్బయ్య, జోగు ఐలుమల్లు, జోగు ఐలయ్య, ఉప్పల పరశురాములు, సోమయ్య, ఇస్తారి రాజు పాల్గొన్నారు.

పెట్రేగిపోతున్న పెట్రోల్ దొంగలు!



సీసీ టీవీ ఫుటేజీలో దర్దెపల్లి రోడ్డులో బైక్ నుంచి పెట్రోల్ తీస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

పాలకుర్తిటౌన్: పాలకుర్తిలో రాత్రి వేళల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను టార్గెట్ చేసి దొంగలు వాటిలోని ఇంధనాన్ని అపహరిస్తూ పెట్రేగిపోతున్నారు. మండల కేంద్రంలోని దర్దెపల్లి రోడ్డులో పెట్రోల్ అపహరణకు సంబంధించిన సీసీ పుటేజీలు లభ్యమయ్యాయి. మండల కేంద్రంలోని జనగామ రోడ్డు, స్టేషన్ ఘన్‌పూర్ రోడ్డు, విస్నూరు రోడ్డులో నిలిపి ఉంచిన బైక్‌లలోని పెట్రోల్‌ను నిత్యం రాత్రి 12 గంటల తర్వాత దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. తమ బండిలోని పెట్రోల్ పోయిందన్న విషయాన్ని మరొకరికి చెప్పుకోలేక, రోజురోజుకు ధరలు పెరుగుతుండడంతో తమ బైక్‌లో పెట్రోల్ కొట్టించుకోలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచి పెట్రోల్ దొంగలను అదుపులోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలి



కొడకండ్ల: నిర్దేశిత సమయంలో పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కుడికాల భాస్కర్ అన్నారు. బుధవారం మొండ్రాయి సబ్‌సెంట ర్ లో ఆర్ఐ వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన రిజిస్టర్లను పరిశీలించారు. ఏఎన్ఎం కల్యాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



శాంపిల్స్‌ను సేకరిస్తున్న ఏఓ విద్యాకర్‌రెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు, మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. అలాగే మండలంలోని పోచన్నపేటలోని రైతుమిత్ర ఎరువుల దుకాణంలో విత్తనాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ విత్తనశుద్ధి కేంద్రానికి పంపించామన్నారు. నివేదికల అనంతరం చర్యలలు చేపడతామని తెలిపారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అద్దాల పంపిణీ

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ జనగామ ఆధ్వర్యంలో గత వారం రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. 42 మందిని గుర్తించి వారిలో 26 మందిని కంటి ఆపరేషన్‌కు హైదరాబాద్‌లోని ఎంఎస్ రెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆపరేషన్ పూర్తి చేసుకొని వచ్చిన వారికి బుధవారం అద్దాలు పంపిణీ చేశారు. కృష్ణారెడ్డి, సంజీవ రెడ్డి, అనిత, నరేందర్ పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో అల్పాహారం..

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో జిల్లా గవర్నర్ నాగేశ్వరరావు అల్పాహారం అందజేశారు. జోన్ చైర్మన్ జైన రమేష్ పాల్గొన్నారు.

నోట్‌బుక్స్..

కొడకండ్ల: హక్యాతండా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దాతలు జగన్‌మోహన్‌రెడ్డి–సంపత్‌కుమారి దంపతులు అందించిన నోట్‌బుక్స్, కథల పుస్తకాలు, పెన్, పెన్సిల్స్‌ను బుధవారం హెచ్ఎం వి.రజిత అందజేశారు. దాతల అందజేసిన పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కోరారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు ఇందిరా నగర్ కాలనీలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి ఆరు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ మాట్లాడారు. హరితహారంలో భాగంగా ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు.

మొక్కలు నాటాలి

బచ్చన్నపేట: రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటాలని మండలంలోని పోచన్నపేట సర్పంచ్ గట్టు మంజుల అన్నారు. బుధవారం గ్రామంలో పలువుకి వన నర్సరీ వద్ద ఎంపీటీసీ మామిడి అరుణతో కలిసి మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ భూముల్లో, పొలం గట్లపై మొక్కలను నాటాలని చెప్పారు. పచ్చని చెట్లు ఉంటే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అన్నారు.

కేవీఆర్ జన్మదిన వేడుకలు

కొడకండ్ల: డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బాల్నె వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

నివాళి

పాలకుర్తి టౌన్: చెన్నూరులో విశ్వబ్రాహ్మణ కుటుంబానికి చెందిన కటికమోజు ఆంజనేయులు (40) మృతి చెందారు. కాగా, బుధవారం మృతదేహానికి మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యాకస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి టౌన్: మైలారం గ్రామానికి చెందిన సునార్ డబల్ సింగ్(50) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డబల్‌సింగ్ కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులే కుటుంబ కలహాలకు దారితీశాయని తెలిసింది. ఈ విషయమై పోలీసులను అడిగితే తమ దృష్టికి రాలేదని చెప్పారు.